

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## వరంగల్

ములుగు - మహబూబాబాద్

జనగామ - జయశంకర్ భూపాలపల్లి - హన్మకొండ

సోమవారం | 23 | ఫిబ్రవరి | 2026 • పేజీలు : 7


## వ్యవసాయ యాంత్రీకరణ పథకం సద్విని యోగం చేసు కోవాలి : జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్



**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) :** 50 శాతం రాయితీతో రైతులకు వ్యవసాయ యంత్ర పరికరములు జిల్లాలో అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని జిల్లా రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఎస్ఎంఏఎం పథకంలో భాగంగా జనగాం జిల్లాకు 2025-26 సంవత్సరానికి గాను 2.73 కోట్ల బడ్జెట్ కేటాయించగా ఈ పథకంలో బ్యాటరీ పంపులు, తైవాన్ పంపులు, రోటవేటర్లు, విత్తనాలు నాటే మిషన్లు, కేజీ వీల్స్, కలుపు తీసే యంత్రాలు, గడ్డికట్టె యంత్రాలు, డ్రోన్లు, ట్రాక్టర్లు, నాగలి, పవర్ టిల్లర్ పరికరాలు మంజూరయ్యాయన్నారు. రైతులకు నచ్చిన పరికరాన్ని ఎన్నుకొని సంబంధిత కంపెనీలకు రాయితీ పోను మిగతా డబ్బులు డీడీలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు కు దరఖాస్తులు ఇచ్చిన యెడల లక్ష లోపు ధర ఉన్న పరికరాలను మండల కమిటీ, లక్ష కన్నా ఎక్కువ విలువ గల పరికరాలను జిల్లా కమిటీ ద్వారా లబ్దిదారుల ఎంపిక చేయాల్సి ఉంటుందన్నారు.







- ప్రాజెక్టులను గాలికి వదిలేసే ప్రసక్తే లేదు.
- ప్రణాళికా బద్ధంగా ప్రాజెక్టు ల నిర్మాణం.
- ప్రతి ఇంటికి సాగు నీరు...
- ప్రతి ఇంటికి త్రాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- గోదావరి జలాలపై స్పష్టత

సీఎం రేవంత్ రెడ్డి

# భూసేకరణ కోసం... రూ.600 కోట్లు మంజూరు చేస్తాం...

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి :** తెలంగాణలో చేపట్టిన సాగునీటి. త్రాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేయడం జరగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో నిర్మితమైన ప్రతి ప్రాజెక్టు ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. గతంలో ప్రారంభమైన ప్రాజెక్టులు సాంకేతిక, ఆర్థిక లేదా పరిపాలనా కారణాలతో నిలిచిపోయినా, వాటిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం లో ఆదివారం. సమక్క సాగర్ ప్రాజెక్ట్ వద్దకు హెలికాప్టర్ లో చేరుకున్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ

మిగతా 2 లో...

## ప్రాజెక్టులు ప్రజల అభివృద్ధికి పునాది రాళ్లు

### మంత్రి ధనసరి అనసూయా డాక్టర్ సీతక్క



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజాజ్యోతి :** రాష్ట్రంలో కొనసాగుతున్న సాగునీటి, త్రాగునీటి ప్రాజెక్టులు ప్రజల జీవితాల్లో స్థిరమైన మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రాజెక్టులను గాలికి వదిలేయడం అనే ప్రశ్నే లేదని, ప్రతి పనిని సమగ్ర సమీక్షతో పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, గ్రామీణ ప్రాంతాల్లో సాగునీటి వసతులు మెరుగుపడితే రైతుల ఆదాయం పెరుగుతుందని తెలిపారు. ప్రతి ఎకరానికి నీరు అందేలా, ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన త్రాగు నీరు చేరేలా కార్యాచరణ

మిగతా 2 లో...

## శ్రీ భద్రకాళీ అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ తమన్



**హనుమకొండ ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి)** వరంగల్ మహానగరంలోని చారిత్రక ప్రాశస్త్యం గల శ్రీ భద్రకాళీ దేవస్థానంను ఆదివారం ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్ తమన్ దర్శించుకున్నారు. అమ్మవారిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన తమన్ కు ధర్మకర్తలు తొనుపునూరి వీరన్న, ఓరుగంటి పూర్ణచందర్, మోత్కురి మయూరి రామేశ్వరరావు, అనంతుల శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి రామల సునీత, ప్రధానార్చకులు భద్రకాళి శేషులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఆశీర్వచన మండపంలో అర్చకులు మహాదాశీర్వచనం అందించి, అమ్మవారి శేషవస్త్రాలు బహూకరించి ప్రసాదాలు అందజేశారు. అలాగే ప్రముఖ హాస్యనటుడు రాకింగ్ రాకేష్ కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం కావడంతో భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారి దర్శనానికి పోటెత్తారు.

## ప్రాజెక్టులు ప్రజల అభివృద్ధికి పునాది రాళ్లు

(మొదటి పేజీ తరువాయి...)

రూపొందించామని వివరించారు. ప్రాజెక్టుల పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యం ఇస్తూ, పారదర్శకతతో ముందుకు సాగుతున్నామని మంత్రి అన్నారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నిర్మాణం కాదు, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా అభివృద్ధి చేయడమేనని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతోందని, ప్రభుత్వం ప్రజల విశ్వాసానికి తగిన విధంగా పని చేస్తోందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి ఎస్ ఎస్ పి లు సుదీర్ రామ్నాద్ కేకన్. సిరిషెటి సంకీర్త్ పాల్గొన్నారు.

## కోటగుళ్లు శిల్ప సంపద అద్భుతం

♦ ఇంగ్లండ్ దేశస్థులు సిమన్, వాలేరీ



**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి22** కోటగుళ్ళు శిల్ప సంపద అద్భుతమని ఇంగ్లాండ్ దేశానికి చెందిన సిమన్, వాలేరీ లు అన్నారు. శనివారం ప్రసిద్ధిగాంచిన చారిత్రక సంపద కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ ను వారు సందర్శించారు ఈ సందర్భంగా ఆలయ విశిష్టతను చరిత్ర ను రామప్ప గైడ్ గోరంట్ల విజయ్ కుమార్ వారికి వివరించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ఆలయ శిల్ప సంపదను ఫోటోలు వీడియోలు చిత్రీకరించుకున్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ ఖమ్మంలో గణపురం క్రీడాకారులు

**గణపురం ప్రజాజ్యోతి ఫిబ్రవరి22** గణపురం మండలం సీఎం కప్ సెకండ్ ఎడిషన్ 2026 రాష్ట్రస్థాయి బాల్ బ్యాట్మెంటన్ క్రీడల లలో పాల్గొన్న గణపురం మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు. సీఎం కప్ 2026 లోభాగంగా జిల్లాస్థాయిలో నిర్వహించిన బాల్ బ్యాట్మెంటన్ క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి ఖమ్మం లో నిర్వహించిన బాల్ బ్యాట్మెంటన్ రాష్ట్రస్థాయి క్రీడలలో పాల్గొన్న జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంమండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు కల్లూరి రాజ్ కుమార్, కల్లూరి సాగర్, పసునూటి అభిరామ్ ,కోచ్ మామిడిశెట్టి రవి పాల్గొన్నారు.




# భూసేకరణ కోసం 600 కోట్లు మంజూరు చేస్తాం...





(మొదటి పేజీ తరువాయి...)

సలహాదారులు వేం నరేందర్ రెడ్డి, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ కు, రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., ఎస్.పి. సుధీర్ రామ్నాథ్ కేకన్ , ఐటిడిఏ పి.ఓ. చిత్ర మిశ్రా లు పుష్ప గుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు.

**గోదావరి జలాలపై స్పష్టత**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గోదావరి నది జలాల వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణం మరియు అభివృద్ధి అంశాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. గోదావరి జలాలపై ఉన్న అభిప్రాయ భేదాలు, వివాదాలను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా పరస్పర అవగాహనతో ముందుకు వెళ్లడం ప్రభుత్వ విధానమని పేర్కొన్నారు.

**ప్రతి ఎకరానికి సాగునీరు ప్రతి ఇంటికి త్రాగునీరు**

తెలంగాణలో ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఇంటికి స్వచ్ఛమైన త్రాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సీఎం వెల్లడించారు. ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టి, గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధే తమ ప్రభుత్వ ధ్యేయమని, రానున్న 10 సంవత్సరాలు తెలంగాణ ప్రజల ఆశీస్సులతో తమ ప్రభుత్వమే



కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు.

మేధావుల సూచనలు స్వీకరిస్తూ అభివృద్ధి కి బాటలు చేయడం జరుగుతుంది అన్నారు. కేసీఆర్ “80వేల పుస్తకాలు చదివిన గొప్ప మేధావులు రాష్ట్రంలో ఉన్నారు. మీ సూచనలు, సలహాలు మా ప్రభుత్వానికి మార్గదర్శకం అవుతాయి” అని సీఎం పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పాలన సాగించడం తమ లక్ష్యమని తెలిపారు. విమర్శలు చేయడం మానుకోవాలి అన్నారు.

**మేడారం జాతర శాశ్వత అభివృద్ధి**

మేడారం జాతరను విజయవంతంగా నిర్వహించామని, భవిష్యత్తులో శాశ్వత అభివృద్ధి చర్యలు చేపడతామని సీఎం స్పష్టం చేశారు. భక్తులకు మెరుగైన వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

గోదావరి జలాల సమగ్ర వినియోగం, ప్రాజెక్టుల నిర్మాణం, ప్రజల సంక్షేమం — ఈ మూడు లక్ష్యాల సాధనలో తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ముందుకు సాగుతోందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**ప్రాజెక్టులను గాలికి వదిలే ప్రశ్నే లేదు ప్రజలకు ఉపయోగపడేలా పూర్తి చేస్తాం”**

తెలంగాణలో చేపట్టిన సాగునీటి మరియు త్రాగునీటి ప్రాజెక్టులను గాలికి వదిలేయడం జరగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల డబ్బుతో నిర్మితమైన ప్రతి ప్రాజెక్టు ప్రజలకు పూర్తి స్థాయిలో ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించి ముందుకు తీసుకెళ్తామని తెలిపారు.

గతంలో ప్రారంభమైన ప్రాజెక్టులు సాంకేతిక, ఆర్థిక లేదా పరిపాలనా కారణాలతో నిలిచిపోయినా, వాటిని సమీక్షించి అవసరమైన సవరణలు చేసి పూర్తిచేస్తామని సీఎం పేర్కొన్నారు. ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనానికే ఖర్చు కావాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన అన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఎకరానికి సాగునీరు, ప్రతి ఇంటికి త్రాగునీరు అందించడమే లక్ష్యమని, అందుకోసం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామని వివరించారు. నాణ్యత, పారదర్శకత, సమయపాలనకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాజెక్టుల పనులను వేగవంతం చేస్తామని చెప్పారు.

ప్రజలకు ఉపయోగపడని పనులకు చోటు ఉండదని, అభివృద్ధి ఫలాలు నేరుగా ప్రజలకు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

ముందుగా దేవాదుల ప్రాజెక్టు గోదావరి నీ పరిశీలించారు. ప్రాజెక్టు ఇంటెక్ వేల్ మోటార్లను పరిశీలించారు.

**భూసేకరణ కోసం 600 కోట్లు మంజూరు చేస్తాం**

బడ్జెట్ లో పే అన్ని అంచనాలను ప్రభుత్వం ముందు ఉంచి ఆమోదం తీసుకోవాలి..

మార్చి లో మంత్రి వర్గ సమావేశం ఏర్పాటు చేసి అన్ని అంచనాలకు ఆమోదం తెలియజేస్తాం..

**నెల లోపల దేవాదుల పంప్ రిపేర్ చేయాలి..**

అసెంబ్లీ సమావేశాల సమయం లో ఎంఎల్ ఏ లు,అధికారులతో దేవాదుల పైన కమిటీ హాల్ లో ప్రత్యేక సమావేశం ..

అన్ని ప్రాజెక్టుల భూ సేకరణ కోసం ప్రత్యేక కార్పస్ ఫండ్ ఏర్పాటు చేస్తాం..

పరిహారం గ్రీన్ ఛానల్ లో నిధులు మంజూరు చేస్తాం..

భూ సేకరణ జాప్యం వల్ల ప్రాజెక్ట్ ల పనులు ఆగడానికి వీలు లేదు.

రామప్ప చెరువు నుంచి జంపన్న వాగు కు నీరు అందించే ప్రణాళిక పైన నివేదిక ఇవ్వాలి. అంటూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఎమ్మెల్యే. ఎంపీ. స్థానిక ప్రజా ప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 2 నెలల పసి పాప హత్యకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలి.

♦ తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి** నాగర్‌కర్నూల్ జిల్లా పరిధిలో ఎస్సీ వర్గానికి చెందిన చిన్నారి ప్రాణాలు కోల్పోవడం ప్రమాదం కాదని, ఇది అగ్రకుల దౌర్జన్యం ,హత్య అని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు గంపల శివ అన్నారు . ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో అగ్రకుల పెత్తందారుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతరలో వారి ఆర్థిక అరాచకత్వాన్ని అక్రమ వసూళ్లను ప్రశ్నించినందుకు దళిత కుటుంబానికి చెందినవారని వారి పైన అన్యాయంగా అక్రమంగా మహిళలని చూడకుండా దౌర్జన్యంగా దాడి చేసి విచక్షణ రహితంగా కొట్టడం జరిగిందని ఈ క్రమంలోనే వారి కూతురు రెండు నెలల పసి పాపను కాలితో తనడం వల్ల చిన్న పాప ఆ సంఘటనలో మృతి చెందడం జరిగిందని ఈ విషయాన్ని అంతా గమనిస్తూ పోలీసులు ఏమి తెలియనట్టుగా విహరిస్తూ అగ్రకుల పెత్తందారులకు వత్తాసు పలుకుతూ నిర్లక్ష్యంగా ఉన్నారు తప్ప గొడవను ఆపే ప్రయత్నం చేయలేదని అన్నారు . పోలీసులే ప్రేక్షక పాత్ర వహిస్తూ ఉండడం వల్లే ఒక చిన్నారి ప్రాణం పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు . దానికి గల ప్రధాన కారణం దాడికి పాల్పడిన వారు అగ్రకులానికి చెందిన వారే కావడం గమనార్హం బాధితుల పక్షాన నిందితుల పైన కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం గా వ్యవహరించడం ని సిగ్గుగా వ్యవహరించడం పోలీస్ వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని అన్నారు. కనీస భద్రతా చర్యలు తీసుకోకుండా అధికారుల కనుసన్నల్లోనే అగ్రకులానికి చెందిన నేరస్థులకు వత్తాసు పలకడం నిర్లక్ష్యంగా వ్యవహరించడం అత్యంత దుర్మార్గం. ఇది ఎస్సీ ఎస్టీ. యాక్ట్ 1989 ఉల్లంఘనకు స్పష్టమైన ఉదాహరణ. ఈ ఘటన హత్యకు సమానమైన సామాజిక నేరం. దళితుల ప్రాణాల పట్ల ఉన్న



పాలనా నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతుంది. కులవ్యవస్థ ఇంకా కొనసాగుతుందనే భయంకర వాస్తవానికి ఇది నిదర్శనం ఇప్పటివరకు ఒక్క అగ్రకుల నేరస్థుడిని కూడా అరెస్ట్ చేయలేదు. ఎస్సీ ఎస్టీ.చట్టం కింద కేసు నమోదు చేయలేదు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. ఇది రాజ్యాంగ ద్రోహం తప్ప మరొకటి కాదు. ఈ ఘటనపై ఎస్సీ ఎస్టీ యాక్ట్ లోని సంబంధిత సెక్షన్ల కింద తక్షణమే కేసు నమోదు చేయాలి. డిమాండ్ చేశారు. అగ్రకులానికి చెందిన నేరస్థులందరినీ వెంటనే అరెస్ట్ చేయాలి. బాధిత కుటుంబానికి కనీసం రూ. 25 లక్షల పరిహారం వెంటనే చెల్లించాలి. సంబంధిత పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి. ఈ ఘటనపై న్యాయ విచారణ (జుడిషియల్ ఎంక్వయిరీ )ప్రకటించాలి. దళితుల ప్రాణాలు చవకగా మారిన ఈ వ్యవస్థపై మౌనంగా ఉండకుండా ప్రజాస్వామిక వాదులు, మేధావులు స్పందించాలని, న్యాయం జరిగే వరకు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని కోరుతున్నాము. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించకపోతే, తెలంగాణ మాల మహానాడు ఆధ్వర్యంలో బాధితుల తరపున పెద్ద ఎత్తున పోరాటం చేపడతామని గంపల శివ.హెచ్చరించారు.

# ఎల్కతుర్తి శివారు సూరారం వద్ద రోడ్డు డైవర్షన్ సూచికలు లేక వాహనాదారులకు తీవ్ర ఇబ్బందులు

- సంబంధిత అధికారుల స్పందన కరువైంది..?





**ఎల్కతుర్తి ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి)** హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి శివారు సూరారం నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక డైవర్షన్ వద్ద సరైన సూచికలు లేక వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూరారం పెట్రోల్ బంక్ సమీపంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నప్పటికీ రహదారి మళ్లింపు గురించి స్పష్టమైన మార్గదర్శక బోర్డులు లేకపోవడం సమస్యలకు దారితీస్తోంది. డైవర్షన్ బోర్డులు దిశా సూచికలు హెచ్చరిక పలకాలు సరైన ప్రదేశాల్లో లేకపోవడంతో పలువురు వాహనాదారులు రాంగ్ రూటులోకి వెళ్లి కిలోమీటర్ల దూరం ప్రయాణించి తిరిగి వెనక్కి రావలసి వస్తోంది. దీని వల్ల సమయం ఇంధనం వృధా కావడమే కాకుండా ప్రమాదాల భయం కూడా నెలకొంది. ముఖ్యంగా ఇతర ప్రాంతాల నుండి వచ్చే ప్రయాణికులు మార్గం తెలియక మరింత అయోమయానికి గురవుతున్నారు. ప్రత్యేకించి రాత్రి సమయంలో పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతోంది. డైవర్షన్ వద్ద తగిన లైటింగ్ సదుపాయం లేకపోవడంతో పాటు రిఫ్లేటర్ స్టిక్కర్లు రోడ్డు మార్కింగ్ లేకపోవడం వలన వాహనాదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంది. భారీ వాహనాలు బస్సులు మళ్లింపు మార్గంలో ఇబ్బందిగా తిరగాల్సి వస్తోందని స్థానికులు చెప్తున్నారు. స్థానిక ప్రజలు వాహనాదారులు తక్షణమే స్పష్టమైన డైవర్షన్ బోర్డులు ప్రతిపలించే రిఫ్లేటర్ సూచికలు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని రాత్రి వేళల్లో తగినంత లైటింగ్ కల్పించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఇప్పటికే పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అధికారులు వెంటనే స్పందించి అవసరమైన భద్రత చర్యలు చేపడితే వాహనాదారుల ఇబ్బందులు తగ్గి ప్రమాదాలను నివారించే అవకాశం ఉందని ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మృతురాలి కుటుంబానికి పరామర్శ



**శాయంపేట ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి :** మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన మహమ్మద్ జబ్బార్ తల్లి మహమ్మద్ నన్నెమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించగా విషయం తెలుసుకున్న ఉప సర్పంచ్ తుడుం రాజు మరియు వార్డ్ మెంబర్లు కలిసి వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించి మృతురాలి కుటుంబానికి 50 కిలోల బియ్యం అందజేసి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు నాలిక వీర ప్రతాప్, పోతుగంటి ప్రమీల సారయ్య, గజ్జి రాజు, అంకేశ్వరం సాయిలక్ష్మీ మొగిలి,కోడిమాల మహేందర్,గజ్జి రమేష్, గడ్డమీది హారతి కర్ణాకర్,ఐరబోయిన స్వప్న రాజు, కందగట్ల ప్రవీణ్ కుమార్,తుడుం స్రవంతి నాయకులు తుడుం వెంకటేష్,పోతుగంటి సాంబరాజు,ఎర్ర తిరుపతిరెడ్డి,ఎండి అఫ్జల్, కత్తి సాగర్, ఆకునూరి అంకుస్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్య స్నేహితుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**ఆత్మకూరు, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి):**బాధిత బాల్య స్నేహితుని కుటుంబానికి చిన్న నాటి స్నేహితులు ఆర్థిక సహాయం అందచేశారు. 1996–97 సంవత్సరంలో తమతో కలిసి ఆత్మకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదివిన తోటి స్నేహితునికి 50 వేల సహాయం అందచేశారు. ఈ రోజుల్లో ఒక మిత్రునికి ఆపద వస్తే "మేమున్నాం" అని నిలబడి, వారి కుటుంబానికి ధైర్యం చెప్పడం మాటల్లో చెప్పలేనంత గొప్ప విషయం. ఆ స్నేహబంధం ఎంత నిజమో, ఎంత బలమో 1996–97 బ్యాచ్ మిత్రులు తమ చర్యలతో నిరూపించారు.ఆపదలో ఉన్న మిత్రుని కుటుంబానికి 50,000/– ఆర్థిక సహాయం అందిస్తూ, స్నేహం అంటే కేవలం జ్ఞాపకాలు కాదు. అవసరమైన సమయంలో అండగా నిలబడటమే అని చూపించారు. ఇది కేవలం సహాయం కాదు..అది ఒక భరోసా, ఒక మనసు, ఒక బంధం మిత్రులకు ఎలాంటి కష్టం వచ్చినా ముందుకు వచ్చి తోడుగా నిలబడే మీ సేవాభావం నిజంగా అభినందనీయమని గ్రామస్తులు అభినందించారు. మీలాంటి స్నేహితులు ప్రతి బ్యాచ్‌లో ఉండాలి, మీరే అందరికీ ఆదర్శం.. మీ అందరికీ పేరు పేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు మీ స్నేహబంధం ఇలాగే చిరస్థాయిగా నిలవాలని పలువురు కోరారు.

# డీసీసీ అధ్యక్షులు పార్టీకి పెద్ద దిక్కు

- సంఘటన్ సృజన్ అభియాన్ శిక్షణలో సీఎం రేవంత్ రెడ్డి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22, (ప్రజా జ్యోతి):** ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న 'సంఘటన్ సృజన్ అభియాన్' శిక్షణ కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ఆదివారం రెండో రోజు శిక్షణలో పాల్గొన్నారు. పార్టీ నిర్మాణ బలోపేతం లక్ష్యంగా నిర్వహించిన ఈ శిక్షణ శిబిరానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తదితరులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాల్లో పార్టీకి డీసీసీ అధ్యక్షులే ప్రధాన ఆధారంగా ఉండాలని పేర్కొన్నారు. సమన్వయం, కష్టపాటు, ప్రజలతో అనుబంధం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. డీసీసీ అధ్యక్ష పదవి హోదా కాదని, బాధ్యతగా తీసుకుని పనిచేసినప్పుడే కాంగ్రెస్‌కు భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పైరవీలు, వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆయన పిలుపునిచ్చారు.శిక్షణ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా

- కళాశాల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే రేవూరి



**పరకాల, ఫిబ్రవరి 22,(ప్రజా జ్యోతి):**ఆదివారం హనుమకొండ భవాని నగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల యొక్క 2026–2027 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కొరకై రూపొందించిన కళాశాల వాల్ పోస్టర్ ను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం,ప్రభుత్వ విద్యా సంస్థలపై ప్రత్యేక దృష్టి సాధించినదని, ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందుబాటులో ఉంటుంది అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్నత చదువులు పూర్తి చేసిన అనుభవజ్ఞులైన అధ్యాపకులు బోధన చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారని అన్నారు. పరకాల పట్టణ కేంద్రంలో నూతన ప్రభుత్వా డిగ్రీ కళాశాల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, త్వరలో ప్రారంభించబోతున్నామన్నారు. విద్యార్థులు ప్రభుత్వ విద్యాసంస్థలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. పరకాల పట్టణాన్ని ఎడ్యుకేషన్ హబ్ గా తీర్చిదిద్దుతా అన్నారు.

# అంబరాన్ని అంటిన షైన్ వార్షికోత్సవ సంబరాలు

- అంగరంగ వైభవంగా 'రంగమంచ్' కార్యక్రమం








**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 21, (ప్రజా జ్యోతి):** హనుమకొండ బాలసముద్రంలోని షైన్ ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో 'రంగమంచ్ ' పేరుతో వార్షికోత్సవ సంబరాలు శనివారం కాళోజి కళాక్షేత్రంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, తల్లిదండ్రుల భాగస్వామ్యం కార్యక్రమాన్ని విశేషంగా నిలిపాయి.ముఖ్య అతిథిగా హాజరైన గ్రూప్–1 అధికారి శ్రీజ విద్యార్థుల ప్రతిభను అభినందించారు. తాను షైన్ పాఠశాల విద్యార్థిని కావడం గర్వంగా ఉందని పేర్కొన్నారు. అతిథులుగా వీరయ్య, రాజేందర్, శ్రీరాములు లింగయ్య, ఐఐటి ముంబైకు చెందిన కిరణ్ పాల్గొన్నారు.దీపప్రజ్వలనతో ప్రారంభమైన కార్యక్రమంలో విద్యార్థులు నృత్యాలు, గానాలు, నాటికలతో ప్రేక్షకులను అలరించారు. తల్లిదండ్రులకు ప్రత్యేక గేమ్ షోలు నిర్వహించి, పిల్లలతో కలిసి వేదికపై ప్రదర్శన చేసే అవకాశమివ్వడం విశేషంగా నిలిచింది.ఈ కార్యక్రమంలో షైన్ పాఠశాలల చైర్ పర్సన్ ముగాల కుమార్ యాదవ్, డైరెక్టర్ ఆరూరి కవిత, ప్రాథమిక పాఠశాలల కరస్పాండెంట్ రమ, ప్రిన్సిపల్ సబితతో పాటు ఇతర బ్రాంచీల ప్రిన్సిపాళ్లు రాజ్ కుమార్, విశాల్, ప్రగతి రెడ్డి, కవిత రాణి, మానస, కాలేజీ ప్రిన్సిపాళ్లు రాజు గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కృతజ్ఞతలతో కార్యక్రమం ముగిసింది. షైన్ పాఠశాల వార్షికోత్సవం మరో విజయవంతమైన ఘట్టంగా నిలిచింది.

# వరంగల్ జిల్లాలో ఎర్ర పోస్ట్‌బాక్స్‌లకు మృత్యు ఘంటిక..!

- డిజిటల్ మోజులో ఉత్తరాల సంస్కృతి హత్య
- చరిత్ర చెరిపివేత..! జిల్లాలో ఎర్ర డబ్బాలు అంతరించిపోతున్నాయి
- పోస్ట్‌బాక్స్‌కు తాళం.. ఉత్తరాల వ్యవస్థకు ఫుల్‌స్టాప్




**పర్వతగిరి, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి)** ఒకప్పుడు ప్రతి గ్రామం, ప్రతి కూడలిలో కనిపించిన ఎర్ర పోస్ట్‌బాక్స్ డబ్బాలు నేడు వరంగల్ జిల్లాలో కనిపించకుండాపోతున్నాయి. ఉత్తరం అంటే భావోద్వేగం, నమ్మకం, బంధం అని నమ్మిన కాలం క్రమంగా అంతరించిపోతోంది. డిజిటల్ యుగం పేరుతో ఉత్తరాల సంస్కృతిని నిశ్శబ్దంగా సమాధి చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వ లేఖలు, ఉద్యోగ దరఖాస్తులు, కుటుంబ సమాచార ఉత్తరాలు, పరీక్షా పత్రాలు అన్నీ ఒకప్పుడు ఈ ఎర్ర డబ్బాల ద్వారానే ప్రజల చేతికి చేరేవి. గ్రామీణ ప్రజలకు ఇవే జీవనాడిలా పని చేశాయి. కానీ ప్రస్తుతం జిల్లాలోని అనేక మండలాల్లో పోస్ట్‌బాక్స్‌లు తొలగించబడ్డాయి. కొన్ని చోట్ల పాడైపోయి చెత్తకుప్పల మధ్య పడేసిన దుస్థితి కనిపిస్తోంది. "మా కాలంలో ఉత్తరం వస్తే ఊరంతా ఆసక్తిగా ఎదురు చూసేది. ఇప్పుడు పిల్లలకు పోస్ట్‌బాక్స్ అంటే ఏమిటో కూడా తెలియదు" అంటూ వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యువత మాత్రం వాట్సాప్ మెసేజ్‌కే పరిమితమవుతోంది. దీని వల్ల ఉత్తరం రాసే అలవాటు, చదివే ఓపిక రెండూ అంతరించిపోతున్నాయని మేధావులు సూచిస్తున్నారు. డిజిటల్ సౌకర్యాలు ఉన్నా, ప్రతి గ్రామంలో నెట్‌వర్క్ ఉందా? ప్రతి పేదవాడికి స్మార్ట్‌ఫోన్ ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానం 'లేదు' అనే వస్తోంది. అలాంటి పరిస్థితుల్లో పోస్ట్‌బాక్స్‌లను తొలగించడం గ్రామీణ ప్రజలపై మరో అన్యాయంగా మారుతోంది. చరిత్రకు గుర్తుగా నిలిచిన ఎర్ర పోస్ట్‌బాక్స్‌లను పూర్తిగా మాయం చేయడం అంటే, ఉత్తరాల వ్యవస్థకే తాళం వేసినట్టేనని స్థానికులు మండిపడుతున్నారు.కనీసం బస్టాండ్లు, మార్కెట్ యార్డులు, గ్రామపంచాయతీల వద్దైనా పోస్ట్‌బాక్స్‌లను పునరుద్ధరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేదంటే రేపటి తరాలకు "పోస్ట్‌బాక్స్" అన్న మాట పుస్తకాల్లో చదివే కథగా మాత్రమే మిగిలిపోతుంది!

**పర్వతగిరిలో ఎర్ర డబ్బా ఖైదు! పోస్టాఫీస్‌ను అధికారుల తాళాల ఖానాగా మార్చేశారు**

మండల కేంద్రంలో ప్రజలకు అత్యంత అవసరమైన పోస్ట్ బాక్స్ (ఎర్ర డబ్బా) అధికారుల అహంకారపు నిర్లక్ష్యానికి బలై కనిపించకుండా పోయింది. పోస్టాఫీస్ ఎదుట శాశ్వతంగా ఉండాల్సిన ఎర్ర డబ్బాను అధికారులు ఉదయం బయట పెట్టి, సాయంత్రం కాగానే లోపల పెట్టుకుని తాళాలు వేసి వెళ్లిపోతున్నారు. ఇది పోస్టాఫీస్‌నా? లేక అధికారుల వ్యక్తిగత గోదామా? అంటూ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగాలు ముగించుకుని వచ్చే కార్మికులు, రైతులు, విద్యార్థులు లేఖలు వేయడానికి వస్తే "బాక్స్ లేదు... రేపు రండి" అనే నిర్లక్ష్య సమాధానంతో వెనుదిరగాల్సి వస్తోంది. ఇది పూర్తిగా ప్రజాసేవను కాలితో తొక్కినట్లేనని మండిపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పోస్ట్ బాక్స్ 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలను చెత్తబుట్టలో వేసి అధికారులు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. పోస్ట్ బాక్స్ ప్రజల కోసం ఉందా? లేక అధికారుల సౌకర్యం కోసమా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోనే ఈ దుస్థితి ఉంటే, గ్రామాల పరిస్థితి ఏమిటని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శాశ్వతంగా పోస్ట్ బాక్స్ ఏర్పాటు చేసి, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు.

## ఘనంగా డాక్టర్ కాళిప్రసాద్ రావు జన్మదిన వేడుకలు

- కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన మండల అధ్యక్షుడు దామెరుప్పల చంద్రమౌళి(సిఎం)



**సంగెం,పిబ్రవరి22(ప్రజాజ్యోతి ):**భారతీయ జనతా పార్టీ పరకాల నియోజకవర్గ కాంటేస్ట్డ్ ఎమ్మెల్యే రాష్ట్ర నాయకులు డాక్టర్ పగడాల కాళీప్రసాద్ రావు జన్మదిన వేడుకలు మండల పార్టీ అధ్యక్షుడు చంద్రమౌళి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.అనంతరం అంబేద్కర్ సెంటర్లో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ప్రధానకార్యదర్శి పవన్ సాయి,గొర్లకాపరుల కన్వీనర్ జక్క చేరాలు,రంగరాజు కృష్ణ,సారమ్మ,నాలం చంద్రశేఖర్ గౌడ్ దాసరి కుమారస్వామి బోనాల గోపాల్ అబ్బరబోయిన ప్రభాకర్,రమణచారి,ఎర్రబాక శ్రీను ఓదెల శంకర్ వీరస్వామి సతీష్ సంఘు సూరయ్య బెజ్జంకి రాజు ఇమ్మడి బాబు పాశం నాగరాజు భోగి సంపత్ నరహరి సమ్మిరెడ్డి వంశి మెట్టుపల్లి రవి,తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**రాయపర్తి ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి:**వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జిల్లా పరిషత్ ఉన్నతకొత్తూరు పాఠశాలలో 1994-1994 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారికి విద్యను అందించిన ఉపాధ్యాయులు గోపాల చారీ మరియు సారయ్య మరియు కొత్తూరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠోబా కొత్తూరు గ్రామ సర్పంచ్ కందికట్ల స్వప్న సంతోష్ ఉప సర్పంచ్ చిప్ప శ్రీనివాస్ మరియు పూర్వ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని తమ బాల్య స్మృతులను జ్ఞాపకం చేసుకొని ఉపాధ్యాయులను ఘనంగాసన్మానించడం జరిగింది. తాము చదువుకున్న పాఠశాలకు ఇక సదుపాయాల కల్పనలో పొందుంటామని వాగ్దానం చేయడం జరిగింది. అలాగే ప్రస్తుతం ఎదుర్కొంటున్న త్రాగునీటి సౌకర్యాన్ని అందిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రస్తుత ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవతో సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు

- మంథని డివిజన్ కు కోటి తొమ్మిదివేలు విలువ గల 266 చెక్కుల మంజూరు
- పలిమెల మండలం కి మూడు చుక్కలు మంజూరు

**పలిమెల ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి) :**మంథని డివిజన్ లోని పేద ప్రజలు ఆరోగ్య సమస్యల కై సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు పెట్టు కోగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు చొరవ తీసుకొని 266 చెక్కులను మంజూరు చేయించడం జరిగింది. ముఖ్యమంత్రి సహాయక నిధికి మంథని డివిజన్ నుండి పేద ప్రజలు ఖరీదైన వైద్యం కోసం దరఖాస్తు పెట్టు కోగా ఐటి మరియు భారీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు చొరవ తీసుకొని ఒక కోటి తొమ్మిది వేల విలువగల 266 చెక్కులను మంజూరు చేయించడం జరిగింది అందులో పలిమేల మండలానికి తొంబై తొమ్మిది వేల విలువగా మూడు చెక్కులు మంజూరు అయినట్లు తెలుపగా వారి వివరాలు సిరంగి సునీత వెంకటేశ్ కి 60,000/- వేలు, పెద్దింటి లావణ్య కి 20,000/- వేలు, సిరిశెట్టి హనుమంత్ తండ్రి లక్ష్మయ్య కి 19,000/- వేలు మంజూరు కాగా బాధిత కుటుంబాలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరు కు అన్నిరకాల సహాయ సహకారాలు అందించిన మండల నాయకులకు, మంజూరు చేపించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుక.. ఆధ్యాత్మిక శాంతికి ప్రతీక

- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి





**సంగెం,పిబ్రవరి22 (ప్రజాజ్యోతి):** మండలంలోని గవిచర్ల గ్రామంలోని శ్రీ గుండా బ్రహ్మయ్య స్వామి దేవస్థానంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఆదివారం రోజున పరకాల మాజీ శాసనసభ్యులు చల్లా ధర్మారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ..దేవాలయాలు మన సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలు అని అన్నారు.శ్రీ గుండఅ బ్రహ్మయ్య స్వామి దేవస్థానంలో వివిధ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపన జరగడం ఎంతో శుభప్రదమని,ఈ మహోత్సవం గ్రామ ప్రజలకు శాంతి,సౌభాగ్యం,సుఖసంతోషాలు అందించాలని స్వామివారిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నానని తెలిపారు.గ్రామాల అభివృద్ధి భౌతిక వసతులతో పాటు ఆధ్యాత్మిక విలువలతో కూడినప్పుడే సంపూర్ణంగా సాధ్యమవుతుందని,ఈ పవిత్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటీసీ గూడా సుదర్శన్ రెడ్డి,మాజీ సర్పంచ్ ధోనికెలా రమ శ్రీనివాస్,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే సమాజ వికాసం

- నెక్కొండ ఆంజనేయస్వామి ఆలయ ప్రాకార, ముఖ ద్వార శంకుస్థాపన
- ముఖ్యఅతిథిగా హాజరైన టిపిసిసి సభ్యులు సొంటి రెడ్డి రంజిత్ రెడ్డి

**నెక్కొండ, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి):**ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక వికాసం, సమాజ సర్వతోముఖాభివృద్ధి సాధ్యమవుతుందని టిపిసిసి సభ్యులు సొంటిరెడ్డి రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. నెక్కొండ మండల కేంద్రంలోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ప్రాకార మరియు ముఖద్వార శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు బక్కీ అశోక్ లతో కలిసి రంజిత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం పనులతో బిజీగా ఉండే వారు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. వ్యక్తిగత సామర్థ్యానికి దైవానుగ్రహం తోడైతే అన్ని రంగాల్లో రాణించవచ్చని ఆకాంక్షించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఎర్రబెల్లి సంపత్ రావు, కార్యదర్శి కంది నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దాతలు మల్లంపాటి సంజీవరెడ్డి-పద్మావతి, నవీన్ రెడ్డి-స్రవంతి, డాక్టర్ నరసింహారెడ్డి-సుకన్య రెడ్డి, భాస్కర్ రెడ్డి-రాజ్యలక్ష్మి దంపతులు పూజలు నిర్వహించారు. అర్చకులు గోపాలకృష్ణమూర్తి శర్మ, పండితులు బూరుగుపల్లి శ్రవణ్ కుమార్ శాస్త్రి శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సింగం శ్రావణి ప్రశాంత్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు మోడెం రాజు, కీర్తి రాము, యాట పూర్ణ చందర్, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు మారం రాము, ఈదునూరి యాకయ్య, బొంపల్లి రాజేశ్వరరావు, కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, కొల్లి సుబ్బారెడ్డి, అంబాల రాంగోపాల్ తదితరులు పాల్గొన్నారు.



# "శ్రీ గుండా బ్రహ్మయ్య స్వామి దేవస్థానంలో" ఘనంగా నూతన విగ్రహ ప్రతిష్టాప కార్యక్రమం

- ప్రత్యేక పూజలు నిర్వహించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కూడా చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి
- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ పూజారులు కమిటీ సభ్యులు





**సంగెం,ఫిబ్రవరి22(ప్రజాజ్యోతి):** మండలంలోని గవిచర్ల గ్రామంలో శ్రీ గుండా బ్రహ్మయ్య స్వామి దేవస్థానం నూతన విగ్రహా ప్రతిష్టాప కార్యక్రమంలో ఆదివారం రోజున పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామ్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ పూజారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ...భక్తి భావంతో నిర్వహించిన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన గ్రామ ఐక్యతకు నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రభుత్వంలో ఆలయానికి శంకుస్థాపన చేసుకొని,ప్రారంభోత్సవం చేయడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.దేవుని ఆశీస్సులతో పరకాల నియోజకవర్గ అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని అన్నారు.గ్రామ దేవాలయాలు మన సంస్కృతి,సంప్రదాయాలకు ప్రతీకలు అని,దేవాలయ అభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు.గ్రామానికి బంధువులు ఆడబిడ్డలు కుటుంబ సమేతంగా వచ్చి పూజా కార్యక్రమాలు విగ్రహాలప్రతిష్టలో పాల్గొనగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాషి పాక సదయ్య,ఉపసర్పంచ్ గుమ్మడి సంపత్,దేవాలయ కమిటీ చైర్మన్ కోంతం యాదగిరి,పిల్లలమర్రి కార్తికేయశర్మ,మాజీ జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి,అచ్చ నాగరాజు,భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ సంపత్ రెడ్డి,మాజీ సర్పంచ్ రమ శ్రీనివాసు,పత్తిపాక రమేష్,బాషిపాక యాకోబు,భాషిపాక అశోక్,ముప్పు రమేష్,యార రఘు,వెల్దండ భాస్కర్,కర్దూరి కరుణాకర్, కలింగం,మహాబుబ్ పాష,గ్రామస్తులు మహిళలు బంధువులు,తదితరులు పాల్గొన్నారు.

## బీరప్ప కామారతి కళ్యాణముకు రారండి

- నేడు కుందారంలో ఘనంగా కళ్యాణ మహోత్సవం



**లింగాల గణపురం, ఫిబ్రవరి, 22 (ప్రజాజ్యోతి):** మండలంలోని కుందారం గ్రామంలో కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప కామరతి దేవి కళ్యాణ మహోత్సవం ఆదివారం బియ్యం సంకుట జల్లిక వేట సరుకు బోనాలుసోమవారం బీరప్ప కామరతి దేవి కళ్యాణం గ్రామ కురుమ సంఘం అధ్యక్షులు చిర్ర రాజు మాట్లాడుతూ కళ్యాణ మహోత్సవం పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

## ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి ప్రతి రైతుకు ప్రత్యేకమైన యూనిక్ ఐడీ

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి) :** ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, తన ప్రత్యేక ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీని పొందాలని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ లేకుండా భవిష్యత్తులో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందడం సాధ్యం కాదని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదివారం ఒక ప్రకటన ద్వారా స్పష్టం చేశారు. ఫార్మర్ రిజిస్ట్రీ ఐడీ అనేది ఆధార్ కార్డు మాదిరిగా ప్రతి రైతుకు ప్రత్యేకమైన యూనిక్ ఐడీ అని, ఈ ఐడీ ద్వారా రైతు భూముల పూర్తి వివరాలు సమగ్రంగా నమోదు అవుతాయాన్నారు. ప్రభుత్వ పథకాల అమలులో పారదర్శకత, అర్హుల గుర్తింపు, నేరుగా లబ్ధి బదిలీ సులభతరం అవుతుందన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ ద్వారా పథకాలు అనుసంధానం రైతు బంధు, యాప్ ద్వారా ఎరువుల సరఫరా, ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, వ్యవసాయ యంత్రీకరణ పథకాలు, సబ్సిడీ విత్తనాలు, పంట ప్రదర్శనలు, పంట ఉత్పత్తుల కొనుగోలు ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలు అనుసంధానం అవుతాయని తెలిపారు. ప్రతి రైతు వెంటనే ఫార్మర్ రిజిస్ట్రేషన్ పూర్తి చేసి, తన యూనిక్ ఐడీని పొందవలన్నారు. ఇంకా నమోదు పూర్తి చేయని రైతులు ఈ విషయాలను గమనించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన మరిన్ని వివరాల కోసం, నమోదు ప్రక్రియ పూర్తి చేయుటకు, సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ వ్యవసాయ సిబ్బంది, మండల వ్యవసాయ అధికారి లను సంప్రదించవచ్చన్నారు.

## కంకర వేశారు... తారు రోడ్డు వేయడం మరిచారు



**వర్ధన్నపేట ఫిబ్రవరి 22, ప్రజా జ్యోతి :** వర్ధన్నపేట మండలం, ఇల్లంద గ్రామం నుండి చంద్రు తండా, రందాన్ తండా, నల్లబెల్లి మరియు పర్వతగిరి మండలంలోని వడ్లకొండ గ్రామాలకు వెళ్లె దారి అధ్వానంగా ఉంది. కంకర వేశారు కానీ దాదాపు సంవత్సర కాలం నుండి తారు రోడ్డు వేయడం మర్చిపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారుల పై కంకర రాళ్లు ఎగిరిపడి గాయాల పాలవుతున్నారు. మరియు రోడ్డుపై ప్రయాణించడం ప్రమాదకరంగా మారింది. గ్రామాల నుండి అత్యవసర సమయంలో హాస్పిటల్ కి వెళ్లే వారు, గర్భిణీ స్త్రీలు ఇబ్బందులకు గురవుతున్నారు.

**అధికారులు, గుత్తేదారుడి నిర్లక్ష్యం...** అధికారులు గుత్తే దారుడి నిర్లక్ష్యం వల్ల సకాలంలో రోడ్డు పనులు పూర్తి కావడం లేదు. నెలలు తరబడి కంకర అలాగే వదిలేయడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలు పెరుగుతున్నాయి. వెంటనే సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తారు రోడ్డును పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

## తాడ్వాయి (కామారం) క్రాస్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

- ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఇసుక లారీ



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి:** అతివేగంతో దూసుకొచ్చిన ఇసుక లారీ.. బైక్ పై వెళుతున్న వ్యక్తి నీ లారీ ఢీ కొట్టడం తో అక్కడికక్కడే మృతి. చెందిన సంఘటన చోటు చేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే పరారైన లారీ డ్రైవర్. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నరూ మృతుడు ఏటూరునాగారం మండలం రామన్న గూడెం కు చెందిన గగ్గూరి నవీన్ గా గుర్తించారు. మృతి దేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సివుంది

## జనగామ జిల్లాలో టీజీసెట్–2026 పరీక్ష విజయవంతంగా నిర్వహణ



**జనగామ జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి):** జనగామ జిల్లా పరిధిలో టీజీ సెట్–2026 ప్రవేశ పరీక్షను ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా నిర్వహించినట్లు జిల్లా కన్వీనర్ (డిసిఓ)తెలిపారు. జిల్లాలో మొత్తం 1779 మంది అభ్యర్థులకు పరీక్షా కేంద్రాలు కేటాయించగా, అందులో 1692 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారని, ఈ పరీక్షలను పాలకుర్తి, జనగామ, జాఫర్‌ఘడ్, ఘనపూర్, కేంద్రాలలో పరీక్ష నిర్వహించినట్లు, జిల్లా కలెక్టర్ మార్గదర్శకత్వం, జిల్లా పరిపాలన యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పరీక్షా కేంద్రాల్లో తగిన భద్రతా ఏర్పాట్లు, శాంతి భద్రతల పరిరక్షణ, పరిపాలనా సహకారం సమర్థవంతంగా అందించబడినట్లు అధికారులు పేర్కొన్నారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు సహకరించిన జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ, సంబంధిత అధికారులకు జిల్లా కన్వీనర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## పుష్పాలంకరణ చిన్నారిని ఆశీర్వదించిన మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి

**చెన్నారావుపేట ఫిబ్రవరి 22 (ప్రజా జ్యోతి):** చెన్నారావుపేట మండలంలోని జల్లి గ్రామానికి చెందిన కస్తూరి అనిల్ – సుహాసిని దంపతుల కుమార్తె కస్తూరి అక్షరకు నూతన వస్త్ర ఫల పుష్పాలంకరణ కార్యక్రమంలో పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఈ కార్యక్రమంలో మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ యాదవ్ సర్పంచ్ యాట సుధాకర్. మండల సోషల్ మీడియా ఇన్చార్జ్ బోడ మురళి నాయక్. వార్డ్ మెంబర్లు అంబాల బిక్షపతి. గంధం భాస్కర్. చిట్టి బాబు. మెరుగు రాజు .కొర్ర మోహన్. పార్టీ నాయకులు. గ్రామ నాయకులు .తదితరులు పాల్గొన్నారు.



## ఉద్యోగ, ఉపాధ్యాయుల పిఆర్ సి, పెండింగ్ డి ఏ లు , పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలి



**చెన్నారావుపేట ఫిబ్రవరి 22(ప్రజా జ్యోతి):** ఎండి అబ్దుల్ సలీం, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, జడ్పీహెచ్ఎస్ లింగాపురం లో పదవి విరమణ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన కానుగంటి రంజిత్ కుమార్ టీ ఎస్ యు టి ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి హాజరై , సన్మానించి అభినందనలు తెలియజేసే మాట్లాడుతూ సలీం సేవలు మరువలేనివని, ఆదర్శ ఉపాధ్యాయుడుగా, ఎంతోమంది విద్యార్థులల్లో జ్ఞానాన్ని ,శాస్త్రీయ దృక్పథాన్ని పెంచారని కొనియాడారు.రంజిత్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు జులై 1 2023 నుండి రావాల్సిన పిఆర్సి, గడువు రెండు సంవత్సరాలు దాటిందని వెంటనే ప్రభుత్వం ఉపాధ్యాయుల ఉద్యోగులకు రావలసిన పి ఆర్ సి ని, పెండింగ్ డీ ఏ లను పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ఉద్యోగుల హెల్త్ స్కీమును , నగదు రహిత వైద్యాన్ని, ఓ.పి సేవలను అన్ని కార్పొరేట్ మరియు పక్క రాష్ట్రాల్లో కూడా అమలయ్యేలా రూపొందించాలని కోరారు అలాగే పెన్షనర్ల బెనిఫిట్స్ వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టి ఎస్ యు టి ఎఫ్ వరంగల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తాటికాయల కుమార్, సి సుజన్ ప్రసాద్ రావు, ఎంఈఓ బి సరళ, టీవీ సత్యనారాయణ, పత్తి నరసింహారెడ్డి, సురేందర్, ఇంద్రకరణ్ రెడ్డి, రమణయ్య, భద్రయ్య, ఉమామహేశ్వర్, ఇతర ఉపాధ్యాయులు , విద్యార్థినీ విద్యార్థులు బంధుమిత్రులు పాల్గొన్నారు.

## బైక్ ప్రమాదంలో వ్యక్తి మృతి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు

**కొడకండ్ల, ఫిబ్రవరి 22 (ప్రజాజ్యోతి ):** బైక్ పై నుండి పడి వ్యక్తి మృతి చెందగా, పక్క నుండి వస్తున్న మరొక ద్విచక్ర వాహన వ్యక్తి బైకు అజాగ్రత్తగా నడపడం వల్లనే ప్రమాదం జరిగి తన భర్త చనిపోయాడని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చింతరాజు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు శనివారం తిరుమలగిరి మండలం కోక్య తండా కు చెందిన గుగులోతు నెహ్రూ (38) , కూలి పని చేసుకునే వ్యక్తి, రోజువారి పనుల్లో భాగంగా వెలిశాల గ్రామానికి వెళ్లి సాయంత్రం 7 : 47 నిమిషాలకు తన హోండా గ్లామర్ బైక్ పై తిరిగి వస్తుండగా, మరొక బైక్ పై వస్తున్న అదే గ్రామానికి చెందిన గుగులోతు శంకర్ (45), గ్లామర్ బండి నిర్లక్ష్యంగా నడుపుకుంటూ గుగులోతు నెహ్రూ కు అడ్డురావడంతో వెలిశాల వద్ద ఉన్న హెచ్.పి పెట్రోల్ బంక్ వద్దకు రాగానే గుగులోతు నెహ్రూ బైక్ పై నుండి కింద పడిపోయి తలకు, ఛాతిపై బలమైన గాయాలు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడని, నిర్లక్ష్యంగా బైకు నడిపి తన భర్త మరణానికి కారణమైన వ్యక్తి గుగులోతు శంకర్ పై చర్య తీసుకోవాలని మృతుడి భార్య గుగులోతు సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై చింతరాజు తెలిపారు.

## గుండె పోటుతో మహిళ మృతి



**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి** ఏటూర్ నాగారం మండల కేంద్రంలోని మానస పల్లి గ్రామానికి చెందిన మహిళ జగజంపుల పూజ.. పూలమ్మ. ఆదివారం ఆకస్మాతుగా తీవ్ర జ్వరం రక్త సంబంధిత సమస్య తో పాటు గుండె పోటు రావడంతో మృతి చెందడం జరిగింది దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గత రెండు రోజులుగా జ్వరం తో పాటు రక్త తక్కువగా ఉండటం తో ములుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుండె పోటు రావడంతో మృతి చెందడం జరిగింది అంటూ కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతురాలు పూజా కి వివాహం కావడం తో నిరుపేద కుటుంబ కి చెందిన వారు కావడంతో ఏటూర్ నాగారం వై జంక్షన్ వద్ద కిరణం షాపు నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. అతి చిన్న వయసులో ఆరోగ్యం బాగానే ఉన్నా మహిళ అకస్మత్తుగా మరణించడంతో గ్రామంలో ప్రజలు కుటుంబ సభ్యులు విలపిస్తున్నారు. వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలినీ గ్రామ ప్రజలు కోరుతున్నారూ.

## గోవిందరావుపేట ఎంపీడీఓ కార్యాలయంలో అగ్ని ప్రమాదం



**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** ములుగు జిల్లా గోవిందరావుపేట మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఎంపీడీఓ కార్యాలయం భవనంలోని పైఅంతస్తులో ఉన్న ఒక గదిలో మంటలు ఎగసిపడటంతో అక్కడి సిబ్బంది,స్థానికులు ఒక్క సారిగా భయాందోళనకు గురయ్యారు.ఘటనాస్థలం లోని ఎంపీడీఓ సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.అయితే పైగదిలో ఉన్న ఫైళ్లు,ఫర్నిచర్,కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధం అయినట్లు సమాచారం.అగ్ని ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలియరాలేదు.షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండచ్చని ప్రాథమికంగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు.ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడం ఊరట కలిగించింది.అయితే ఎంపిడిఓ కార్యాలయానికి సంబంధించిన ముఖ్యమైన రికార్డులు కాలిపోయాయా అన్న దానిపై అధికారులు పరిశీలన చేపట్టారు.ఘటనపై సంబంధిత అధికారులు విచారణ ప్రారంభించినట్లు సమాచారం.

# గోదావరి జలాల వినియోగం దానిపై తలెత్తిన వివాదాలపై చర్చిస్తాం

- ప్రాజెక్టుల నిర్మాణంపై బడ్జెట్ లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తాం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి





**ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి):** గోదావరి నదీ జలాల వినియోగం,దానిపై తలెత్తిన వివాదాలు,ప్రాజెక్టుల నిర్మాణం వంటి అన్నిఅంశాల పై శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో సమగ్రంగా ఒకరోజు చర్చిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.గోదావరి,కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కులను కాపాడుతామని, ఆ విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదని పునరుద్ఘాటించారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం జె. చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం పంప్ హౌస్‌ను ముఖ్యమంత్రి ఆదివారం పరిశీలించారు.ఇంజనీర్లను అడిగి అన్ని వివరాలు తెలుసుకున్నారు.మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి,దనసరి అనసూయ సీతక్క,పొంగు లేటి శ్రీనివాస రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డితో పాటు ఎంపీ, ఎమ్మెల్యేలు,అధికారులతో కలిసి దేవాదుల ఇంటేక్ పాయింట్ వద్ద మోటార్లను పరిశీలించిన అనంతరం ప్రాజెక్టు స్థితిగతులపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణ నీటి హక్కుల విషయంలో శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఒక ప్రణాళికాబద్ధంగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ముందుకు వెళుతున్నాం. అవసరమైన నిధులను సమీకరిస్తున్నాం.ఎంతటి జఠిలమైన సమస్య అయినా చర్చల ద్వారా పరిష్కారం అవుతుందని బలంగా విశ్వసిస్తా.గోదావరి, కృష్ణా జలాల్లో తెలంగాణ హక్కు లను కాపాడుతూ శాశ్వత పరిష్కారం కోరుకుంటున్నాం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో చర్చలు ప్రాథమిక దశలో ఉన్నాయి.మాకు ఎలాంటి బేషజాలు లేవు.అధికారుల స్థాయిలో,రెండు రాష్ట్రాల ప్రతినిధులతో చర్చల్లో తేలక పోతే కేంద్ర ప్రభుత్వం వద్ద, లేదా రివర్ మేనేజ్మెంట్ బోర్డుల వద్ద, ట్రిబ్యునళ్ల ముందు లేదా సుప్రీంకోర్టు వరకు ఏదైనా దశల వారిగా వెళ్లాలి.తెలంగాణ నీటి హక్కులను కాపాడే విషయంలో ఎవరికీ ఎలాంటి సందేహాలు అక్కరలేదు. నీటి హక్కుల విషయంలో అనవసరమైన గందరగోళానికి గురిచేయొద్దు. సహేతుకమైన విమర్శలు చేయాలి.నికర జలాలు, మిగులు జలాలు,వరద జలాలపై హక్కులను కాపాడుకుంటాం.గోదావరి నదిపై ప్రాజెక్టులను పూర్తి చేసుకుని ఉత్తర తెలంగాణ ను సస్యశ్యామలం చేసుకోవాలి.అనవసరమైన వివాదాలు,గందరగోళపరిచే విమర్శల వల్ల ప్రయోజనం లేదు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. తెలంగాణ ఏర్పడినప్పుడు నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నప్పటికీ విధానపరమైన లోపాలు, ఆలోచనల కారణంగానో ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయి. గడిచిన పదేళ్లలో చిత్తశుద్ధితో ప్రాజెక్టులను పూర్తి చేసి 967 టీఎంసీల నీటిని వినియోగం లోకి తెచ్చుకుని ఉంటే, వరద జలాలపైనా, వాటా నీటిని తరలించడానికి అవకాశం ఉండే. 2001 లో మొదలైన దేవాదుల రెండు దశాబ్దాలు దాటినా ఇంకా సాగుతూనే ఉంది.ప్రాజెక్టులకు సంబంధించి ఇప్పుడు నిధుల సమస్య వచ్చింది.రూ. 8.11 లక్షల కోట్ల అప్పుల భారం ఉండటం వల్ల అవసరమైన నిధులు విడుదల చేయా లంటే కొరత ఉంది. అందుకే సమీక్షించి వచ్చే రెండేళ్లలో ప్రాజెక్టులన్నీ పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం.అవసరమైన నిధులను తక్షణమే విడుదల చేయడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ఇప్పటికే అంచనాలు పెరిగాయని అధికారులు చెబుతున్నారు.ఈ విధానానికి ముగింపు పలకాలి.సవరించిన అంచనాలను సవరించి మంత్రివర్గం ఆమోదంతో పనులను వెంటనే పూర్తి చేయాలన్న సంకల్పంతో ఉన్నాం.తుమ్మడిహెట్టి నుంచి భద్రాచలం వరకు ఉన్న అన్ని ప్రాజెక్టులపైన పూర్తిస్థాయి సమీక్ష చేసి వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నం చేస్తాం. కాళేశ్వరం నుంచి చుక్కనీటిని ఎత్తిపోయకుండానే తెలంగాణలో అత్యధిక దిగుబడి సాధించాం.గోదావరి, కృష్ణా జలాలపై పక్క రాష్ట్రానికి తరలించడానికి సహకరిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు.ఆరోపణలు సరి కాదు.గోదావరి నదీ జలాలపై శాసనసభలో చర్చ చేద్దాం. సూచనలు ఇవ్వండి.చవక బారు ఆరోపణలతో ప్రయోజనం లేదు.తెలంగాణ గౌరవాన్ని దెబ్బతీయొద్దు. ప్రతిపక్షం ఇచ్చే మంచి సూచనలను స్వీకరిస్తాం. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి మేడిగడ్డ, అన్నారం,సుందిళ్లబ్యారేజీలు తెలంగాణ ప్రజల ఆస్తి. గాలికి వదిలేయం.ప్రజలకు ఉపయోగపడేలా చేస్తాం. బ్యారేజీలకు సంబంధించి ఆనకట్టలకు సంబంధించి భూమి లోపల ఎమైనా సమస్యలున్నాయా అన్న కోణంలో కూడా విశ్లేషణలు జరగాలి.ఆ ప్రాజెక్టు భవిష్యత్తులో ప్రమాదకరంగా మారకూడదన్న ఆలోచనతో ఉన్నాం.ఆ తర్వాత ఆ బ్యారేజీలనుపునరుద్ధరిస్తా అని స్పష్టం చేశారు.ఇటీవల జరిగిన మేడారం శ్రీ సమ్మక్క – సారలమ్మ మహాజాతర బ్రహ్మాండంగా సాగిందని అన్నారు. దక్షిణ కుంభ మేళా తరహాలో జాతర జరిగిందని పేర్కొంటూ,మేడారం అభివృద్ధికి సంబంధించి భక్తులు నిరంతరం సందర్శించేలా అన్నిఏర్పాట్లు చేస్తామన్నారు.శాసనసభ బడ్జెట్ సమావేశాల తర్వాత మరోసారి మేడారం సందర్శించి సమీక్షిస్తానని చెప్పారు.

# ములుగు అభివృద్ధికి మరో ముందడుగు

- లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం పునరుద్దరించండి
- గోదావరి నది కుడి కాల్వపై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం నిర్మించండి
- ములుగు జిల్లా రైతుల పక్షనా సీఎం రేవంత్ రెడ్డికి వినతి పత్రం సమర్పంచిన మంత్రి సీతక్క

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి** ములుగు జిల్లా దేవాదుల పర్యటన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క వినతిపత్రం సమర్పించారు. గోదావరి నది రైట్ బ్యాంక్ పై కొత్త లిఫ్ట్ ఇరిగేషన్ పథకం ఏర్పాటు చేయాలని, అలాగే కన్నాయిగూడెం మండలంలోని లక్ష్మీపురం ఎత్తిపోతల పథకం పునరుద్ధరణకు పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తూపాకులగూడెం, దేవాదుల పరిసర గ్రామాల్లోని చెరువులకు నీరందించేందుకు ఈ ప్రతిపాదిత పథకం కీలకంగా ఉంటుందని మంత్రి పేర్కొన్నారు. ప్రస్తుతం పనిచేయకుండా నిలిచిపోయిన లక్ష్మీపురం లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పునరుద్ధరణతో పాటు, సమ్మక్క సాగర్ ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద గోదావరి బ్యాక్ వాటర్‌ను వినియోగిస్తూ కొత్త పథకాన్ని అమలు చేయాలని ప్రతిపాదించారు. ఈ పథకం ద్వారా మొత్తం 921 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ సాధ్యమవుతుంది. రూ. 22 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రణాళికను సీఎం కు అందచేశారు. లక్ష్మీపురం ఎత్తిపోతల 2007లో నిర్మాణం పూర్తి అయినప్పటికీ, గోదావరి ప్రవాహ మార్పులు, ఇసుక పేరుకుపోవడం వల్ల ప్రస్తుతం ఆ పథకం నిరూపయోగంగా మారిందని...దాన్ని ఉపయోగంలోకి తెచ్చేలా మార్పులు చేయాలని మంత్రి సీతక్క సీఎంను విజ్ఞప్తి చేశారు. ఈ పథకం అమలుతో చిన్న, సన్నకారు రైతులకు సాగునీరు అందుబాటులోకి వచ్చి, భూగర్భ జలాల పునర్వ్యవస్థీకరణ, తాగునీటి లభ్యత పెంపు, రైతుల సామాజిక–ఆర్థిక స్థితి మెరుగుదల సాధ్యమవుతుందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రైతుల సంక్షేమం దృష్ట్యా తక్షణ పరిపాలనా అనుమతి మంజూరు చేయాలని సీఎంను మంత్రి సీతక్క కోరారు. మంత్రి విజ్ఞప్తి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. త్వరలో ఇరిగేషన్ శాఖలో సమావేశం నిర్వహించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# 2027 డిసెంబర్ మాసాంతానికి దేవాదుల పూర్తి




- 5.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు
- జూన్ 2 నాటికి రాష్ట్ర నీటిపారుదల ప్రాజెక్టులకు భూసేకరణ పూర్తి
- భూసేకరణకై పూర్తి స్థాయి నిధుల విడుదలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్
- గోదావరి జలాశయాలలో తెలంగాణా హక్కులను పరిరక్షిస్తా
- తెలంగాణా వాటాలో చుక్క నీరు వదులుకునే ప్రసక్తే లేదు
- మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ఏటూర్ నాగారం ఫిబ్రవరి 22 ప్రజా జ్యోతి**

2027 డిసెంబర్ మాసంతానికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేసి 5.5 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరుతో పాటు త్రాగు నీరు అందిస్తామని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.దేవాదులతో పాటురాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టు లకు అవసరమైన భూసేకరణను జూన్ 2 నాటికి పూర్తి చేస్తామని ఆయన పేర్కొన్నారు.ఆదివారం సాయంత్రం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి తో పాటు దేవాదుల ప్రాజెక్టును మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సందర్శించారు.అనంతరం ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన ప్రాజెక్టు వద్ద జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2001 లో మొదలు పెట్టిన ఈ ప్రాజెక్టు నిర్మాణం పనులు జరుగుతున్న 2026 నాటికి అనుకున్న పురోగతి సాధించ లేక పోయిందన్నారు.అయితే సొరంగ మార్గంతో పాటు పంప్ హౌస్ లలో ఎదురౌతున్న సమస్యలను అధిగమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి స రించించ ంద న్నారు. దేవాదుల తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను జూన్ 2 నాటికి పూర్తి చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.అందుకు అవసరమైన నిధులను విడుదలకు ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం అభినందనీయమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రశంసించారు.గోదావరి జలాశయాలలో చుక్క నీటిని వదులుకునే ప్రసక్తే లేదని ఆయన తేల్చిచెప్పారు. కాంగ్రెస్ పార్టీ భుత్వం అధికారంలోకి వచ్చాకే జలాశయాలలో తెలంగాణా వాటా పరిరక్షణకు చర్యలు మొదలయ్యాయన్నారు.అటు బి,ట్రిబ్యునల్,కే. ఆర్ యం బి ,సుప్రీంకోర్టుతో పాటు కేంద్ర ప్రభుత్వం వద్ద పోరాటం చేస్తున్నది తామే నని ఆయన తెలిపారు. అయితే దురదృష్టవశాత్తు కొందరు అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి ప్రచారాలను త్రిప్పి కొట్టడంతో పాటు తెలంగాణా సమాజం అప్రమత్తంగా ఉండాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణా ప్రజలకు ఉద్బోధించారు.

## ప్రధాని "మన్ కీ బాత్" లో పాల్గొన్న ఎర్రబెల్లి ప్రదీప్ రావు



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి ):**భారత దేశ ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలను ఉద్దేశించి నిర్వహించిన “మన్ కీ బాత్” 131వ ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఆదివారం వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని 21 వ డివిజన్ 73వ బూత్ లో బిజెపి రాష్ట్ర నాయకులు, వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు పార్టీ శ్రేణులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి ప్రదీప్ రావు మాట్లాడుతూ, “మన్ కీ బాత్” కార్యక్రమం దేశ ప్రజలతో నేరుగా ప్రధానమంత్రి మమేకమవుతూ వారి అభిప్రాయాలు, సూచనలు తెలుసుకునే ఒక అద్భుత వేదిక అని అన్నారు. దేశ అభివృద్ధి, స్వచ్ఛ భారత్, స్టార్టప్ ఇండియా, యువతకు ఉపాధి అవకాశాలు, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ వంటి అనేక కీలక అంశాలపై ప్రధాని చేసిన ప్రసంగం ప్రజలకు ప్రేరణనిచ్చేదిగా ఉందన్నారు. ప్రధానమంత్రి ప్రతి ఎపిసోడ్‌లో దేశంలోని సాధారణ ప్రజల విజయగాథలను ప్రస్తావించడం ద్వారా వారికి మరింత ఉత్సాహం నింపుతున్నారని తెలిపారు. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ప్రధాని పిలుపు నిచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు కందిమల్ల మహేష్ ఎరుకల రఘునారెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ కోమాకుల నాగరాజు, కార్యక్రమ కన్వీనర్ గుర్రపు సత్యనారాయణ, సీనియర్ నాయకులు ముచ్చర్ల ప్రభాకర్, రాఘవాచారి, సిరిమల్ల తిలక్, చింతనూరి రాము, ఆదిత్య చిన్న,ఓని వెంకటేష్, మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులపై ఎమ్మెల్యేకు సర్పంచ్ విజ్ఞప్తి

- సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దొంతి



**ఖానాపురం /ఫిబ్రవరి 22(ప్రజా జ్యోతి ):**ఖానాపురం మండలం మంగళ వారిపేటలో పలు అభివృద్ధి పనులకు మంజూరు ఇవ్వాల్సిందిగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిని స్థానిక సర్పంచ్ గొంది సుజాత నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం కోసం విచ్చేసిన సందర్భంగా విజ్ఞప్తి పత్రం అందజేశారు. గ్రామాభివృద్ధి కోసం సహకరించేందుకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సానుకూలంగా స్పందించినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ తాళ్లపల్లి కవిత కమలాకర్ పాల్గొన్నారు.

## ఎల్ఐసి "విజయ యాత్ర"ను దిగ్విజయం చేయాలి

- లియాఫీ 1964 వరంగల్ డివిజన్ అధ్యక్షులు పులి సుధాకర్



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి ):**దేశంలోనే అగ్రగామి బీమా సంస్థ అయిన ఎల్ఐసి సోమవారం చేపట్టిన “విజయ యాత్ర” కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్ డివిజన్ లియాఫీ 1964 అధ్యక్షులు పులి సుధాకర్ ఏజెంట్లకు పిలుపునిచ్చారు. విజయ యాత్ర ద్వారా ప్రజలకు జీవిత బీమా ప్రాధాన్యం, కుటుంబ భద్రత, భవిష్యత్ ఆర్థిక స్థిరత్వం వంటి అంశాలపై అవగాహన పెంచి పాలసీలు చేయాలన్నారు. ముఖ్యంగా యువత, చిన్న వ్యాపారులు, కూలీలు, ఉద్యోగస్తులకు సరైన పాలసీలను పరిచయం చేస్తూ, తక్కువ ప్రీమియంతో ఎక్కువ లాభాలు పొందే విధానాలను వివరించాలని తెలిపారు. ఈ సందర్భంగా లియాఫీ 1964 వరంగల్ డివిజన్ రెసిడెంట్ సెక్రటరీ పబ్బా రాజా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఎల్ఐసి పై ప్రజల్లో ఉన్న విశ్వాసం మరింత బలపడేలా ప్రతి ఏజెంట్ కృషి చేయాలని సూచించారు. విజయ యాత్ర కేవలం ఒక కార్యక్రమం కాకుండా, ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే ఉద్యమంగా మారాలని ఆకాంక్షించారు. విజయ యాత్రను విజయవంతం చేసి ఎల్ఐసి సేవలను మరింత విస్తరించేందుకు అందరూ ఏజెంట్లు కలిసికట్టుగా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో లియాఫీ బ్రాంచి ఇంచార్జి ప్రెసిడెంట్ ఆకుల కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి తండా అశోక్, గన్నోజు శ్రీనివాసచారీ, దురిశెట్టి సంతోష్, మన్నెం ఇంద్రారెడ్డి, ఎరుకల రఘునరెడ్డి, వర్నె తిరుపతి, చెల్పూరి శ్రీను, మల్లాడి రాజిరెడ్డి, అవునూరి కుమారస్వామి, కుర్నా వెంకటేశ్వర్లు, వంగాల వీరాస్వామి, పులి వీరాస్వామి, కట్టా తిరుపతిరెడ్డి, తిప్పని సతీష్, సురేందర్, రవీందర్, మహిళా నాయకురాళ్లు ప్రతిమ, భార్గవి, సునీత తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల డిగ్రీ కళాశాల ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలి

- పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి కొండా సురేఖ



**వరంగల్ సిటీ, ఫిబ్రవరి 22(ప్రజాజ్యోతి ):**ఇంటర్ ద్వితీయ సంవత్సరం పూర్తయిన విద్యార్థులు ప్రభుత్వ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ మరియు అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఆదివారం వరంగల్ తూర్పు తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాల అడ్మిషన్ పోస్టర్ ను వారి నివాసంలో ఆవిష్కరించారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్స్ ప్రారంభము అవుతాయని ఇంటర్మీడియట్ సెకండియర్ పూర్తి అయినా విద్యార్థినులు డిగ్రీలో చేరుటకు ఈ కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ, ఎం ఎస్ టి సి ఎస్, బిజెడ్సీ, ఏం జెడ్ సి, కంప్యూటర్ అప్లికేషన్, బికాం బిజినెస్ అనాలటిక్స్, బి ఏ గ్రూపులలో అవకాశం ఉందని, ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తారని, సెంట్రల్ గవర్నమెంట్ వారిచే స్కిల్ డెవలప్మెంట్ కోర్సులకు శిక్షణకూడా ఇస్తారనీ ఇలాంటి అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగ పరచుకోవాలని, ఉన్నత విద్యా ప్రాధాన్యతను తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి రాధిక మాట్లాడుతూ తూర్పు మహిళా డిగ్రీ కళాశాలలో ఉచిత నాణ్యమైన విద్యను అందిస్తామని, ఈ అవకాశాన్ని అందరూ అందిపుచ్చుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ , అధ్యాపక బృందం పాల్గొన్నారు.